# కాంగ్రెస్‌లో అందరూ సీఎం అభ్యర్థులే..

- ప్రజల గోస వారికి పట్టదు..
- ముఖ్యమంత్రి పీఠం కోసం కొట్లాటే వారికి ముఖ్యం
- అభివృద్ధిలో దేశానికే తెలంగాణ ఆదర్శం
- దేశంలో నంబర్ వన్ సీఎం కేసీఆర్
- హోం మంత్రి మహమూద్ అలీ
- కాంగ్రెస్ సభలకు ప్రజాదరణ శూన్యం
- చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్


విలేకరుల సమావేశంలో హోమ్ మంత్రి మహమూద్ అలీ, చిత్రంలో చీఫ్ విప్ వినయ్‌భాస్కర్

హనుమకొండ, అక్టోబర్ 20: కాంగ్రెస్ పార్టీలో ముఖ్యమంత్రి పోటీకి కోసం జిల్లాల వారీగా పోటీపడుతున్నారని రాష్ట్ర హోమ్ మంత్రి మహమూద్‌అలీ అన్నారు. శుక్రవారం హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. అసలు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాకముందే సీఎం సీటు కోసం 20మందికి పైగా పోటీపడుతుండటం విడ్డూరంగా ఉందన్నారు. గతంలో ఐదేండ్ల పాలనలో నలుగురు సీఎంలు మారిన చరిత్ర కాంగ్రెస్‌దని అన్నారు. 50 ఏండ్లు పాలించిన కాంగ్రెస్ పార్టీ దేశానికి, రాష్ట్రానికి చేసిందేమీ లేదన్నారు. కాంగ్రెస్ పాలనలో క్రాప్ హాలీడేలు.. పరిశ్రమలకు పవర్ కట్‌లు ప్రజలు మరిచిపోలేదన్నారు. విద్యుత్ కొరతతో రాత్రి వ్యవసాయ బావుల వద్దకు వెళ్లి రైతులు చనిపోయిన సందర్భాలు ఉన్నాయని తెలిపారు. కాంగ్రెస్ పాలనలో తెలంగాణ అభివృద్ధిలో కుంటుపడటమే కాకుండా అన్ని వర్గాలు ఇబ్బందులు పడేవారన్నారు. ఎన్నికలు వచ్చినప్పుడే ఇతర పార్టీలు వస్తూ పోతుంటాయని, కానీ బీఆర్‌ఎస్ పార్టీ ఎన్నికలు ఉన్నా, లేకున్నా ప్రజల మధ్య ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తుందని అన్నారు. సీఎం కేసీఆర్ పాలనలో అన్ని వర్గాల ప్రజలు సుఖ సంతోషాలతో ఉన్నారన్నారు. ప్రాజెక్టుల నిర్మాణాలు చేపట్టడం, రైతులకు ఉచిత విద్యుత్, సాగునీరు, ఇంటింటికీ మిషన్ భగరీథ ద్వారా తాగు నీరు అందించడం జరుగుతుందన్నారు. సమైక్య పాలనలో ఉన్న పింఛన్లను దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా రూ.200 నుంచి రూ.2,016 చేసి, మళ్లీ ఇప్పుడు రూ.5వేలకు పెంచనున్నట్లు సీఎం ప్రకటించారన్నారు. తెలంగాణలో శాంతిభద్రతలు మెరుగుపడటంతోపాటు హైదరాబాద్ శాంతిభద్రతలకు నిలయంగా, గంగా జమునా తహజీబ్‌లా మారిందన్నారు. ముస్లిం మైనార్టీ కోసం రెసిడెన్షియల్ పాఠశాలలు, ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌లు అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో విద్య, వైద్యానికి ప్రాధాన్యమిస్తూ పెద్ద మొత్తంలో నిధులు కేటాయించనున్నట్లు తెలిపారు. సీఎం కేసీఆర్ గత ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చినవి, ఇవ్వనివి కూడా అమలు చేశారని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యం అందిస్తున్నామన్నారు. మన ఊరు మన బడి, మన బస్తి మన బడి కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు కల్పించామని తెలిపారు. గాంధీజీ వంటి గొప్ప మహనీయుడు సీఎం కేసీఆర్ అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత హైదరాబాద్ దుబాయి కంటే ఎక్కువ అభివృద్ధి జరిగిందని మంత్రి పేర్కొన్నారు. ప్రజలు బీఆర్‌ఎస్ పార్టీకి, సీఎం కేసీఆర్ అండగా నిలుస్తారని మంత్రి మహమూద్ అలీ పేర్కొన్నారు. సీఎం కేసీఆర్‌తోనే తెలంగాణ మరింత అభివృద్ధి జరుగుతుందని మంత్రి తెలిపారు.

### నిస్సహాయ స్థితిలో కాంగ్రెస్ అభ్యర్థులు : చీఫ్ విప్

కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలు, అన్న చెల్లెలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ ఉమ్మడి వరంగల్ జిల్లాలో పర్యటించిన సందర్భంగా బీఆర్‌ఎస్ పార్టీ, సీఎం కేసీఆర్‌పై అబండాలు మోపుతున్నారని ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. బీఆర్‌ఎస్, బీజేపీ పార్టీలు ఒక్కటేనని మతిలేని, పొంతలేని అవాస్తవపు మాటలను ప్రజలు నమ్మరన్నారు. ఏ నియోజక వర్గానికి ఏ అభ్యర్థి అనేది తెలియని నిస్సహాయ స్థితిలో ఉన్నారని పేరొన్నారు. కాంగ్రెస్ పార్టీ నిర్వహిస్తున్న సభలకు ప్రజాదరణ కరువైందన్నారు. ఎన్నికల్లో ప్రజలను మోసం చేయాలని చూస్తున్న నాయకులకు ప్రజలు తగిన గుణపాఠం చెబుతారన్నారు. సీఎం కేసీఆర్ ముచ్చటగా మూడోసారి సీఎం కావాలని ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. బీఆర్‌ఎస్ పార్టీని బలహీన పరచాలని కాంగ్రెస్, బీజేపీ ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా అధికారంలోకి వచ్చేది బీఆర్‌ఎస్ అన్నారు. కాంగ్రెస్ పాలిత ప్రాంతాల్లో తెలంగాణ ఎన్నికల సందర్భంగా ప్రకటించిన ఆరు హామీలను ఎందుకు అమలు చేయడం లేదని చీఫ్ విప్ ప్రశ్నించారు. గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్‌ఖాన్, కుడా మాజీ చైర్మన్ మర్రి యాదవరెడ్డి, మాజీ డిప్యూటీ మేయర్ సిరాజొద్దీన్, పులి రజినీకాంత్ పాల్గొన్నారు.

## బీఆర్‌ఎస్‌లో చేరిన బండవుతాపురం పద్మశాలీలు

నయీంనగర్, అక్టోబర్ 20: వర్ధన్నపేట మండలం బండవుతాపురం గ్రామానికి చెందిన సుమారు 50 మంది పద్మశాలీ కులస్తులు వర్ధన్నపేట నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థి ఎమ్మెల్యే అభ్యర్థి అరూరి రమేశ్ నివాసంలో శుక్రవారం బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. వారికి ఎమ్మెల్యే గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ పార్టీకి, ఎమ్మెల్యే అభ్యర్థి అరూరికి గ్రామ పద్మశాలి కులస్తులు సంపూర్ణ మద్దతు తెలిపారు. బీఆర్‌ఎస్ పార్టీ చేపడుతున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నారని చెప్పారు. మిత్కుల సోమరాజు, లింగబత్తిని బాలరాజు, విద్యాసాగర్, పుష్పచారి, వెంకటాచలం, నర్సింహ, రాములు, రాజశేఖర్, రాజేంద్రప్రసాద్, రామకృష్ణ, అశోక్, వెంకటేశం పాల్గొన్నారు.


గులాబీ కండువా కప్పుతున్న ఎమ్మెల్యే అరూరి రమేశ్

## ఓటరు చైతన్యంపై అవగాహన కలిగిఉండాలి

వరంగల్, అక్టోబర్ 20: ఓటు హక్కు వినియోగంపై ఓటర్లను చైతన్యం చేసేలా ఆర్‌పీ, ఓబీలు అవగాహన కలిగి ఉండాలని సిస్టమాటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్ (స్వీప్) జిల్లా నోడల్ అధికారి నర్సింహమూర్తి అన్నారు. శుక్రవారం మెప్మా ఆధ్వర్యంలో తూర్పు నియోజకవర్గంలోని లక్ష్మీపురం సీఆర్‌సీ భవన్‌లో ఆర్‌పీ, ఓబీలకు నిర్వహించిన కార్యక్రమంలో ఆయన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్‌పీలు, ఓబీలు ఎన్నికల నియమావళి, నిర్వహణ ప్రక్రియపై కనీస అవగాహన కలిగి ఉండాలన్నారు. స్వయం సహాయక సంఘాల సభ్యులకు ఓటు హక్కు వినియోగంపై చైతన్యం చేయాలన్నారు. సీవో, ఆర్‌పీ, ఓబీలతో ఆయన ఓటరు ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో నియోజకవర్గ నోడల్ అధికారి కోలా రాజేశ్‌కుమార్ గౌడ్, టీఎంసీ రమేశ్, సీవోలు రమాదేవీ, రజిత, రాజ్‌కుమార్, ఖలీద్ అలీ పాల్గొన్నారు.


ఒయాసిస్ ఫెర్టిలిటీ సెంటర్ ప్రారంభిస్తున్న డాక్టర్ నర్సింహారెడ్డి, డాక్టర్ బి. సంధ్యారాణి, డాక్టర్ దుర్గాజీరావు

## ఒయాసిస్ ఫెర్టిలిటీ సెంటర్ ప్రారంభం

హనుమకొండ, అక్టోబర్ 20: హనుమకొండ అంబేద్కర్ సెంటర్‌లో ఫెర్టిలిటీ స్పెషలిస్ట్ డాక్టర్ జలగం కావ్యారావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఒయాసిస్ ఫెర్టిలిటీ సెంటర్‌ను వరంగల్ హాస్పిటల్ ఎండీ, సీనియర్ గైనకాలజిస్ట్, ఫెర్టిలిటీ స్పెషలిస్ట్ డాక్టర్ ఏ నరసింహారెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఇది 33వదని, తెలంగాణాలో 12వదని, వరంగల్‌లో రెండో సెంటర్ అని తెలిపారు. ఈ సెంటర్ ద్వారా అత్యాధునిక ఐవీఎఫ్ ల్యాబ్‌లు, అధునాతన సాంకేతికతతో పురుషులు, మహిళలకు వ్యక్తిగత సంతానోత్పత్తి చికిత్సలను అందించనుందని పేర్కొన్నారు. వంధ్యత్వానికి లోనుకాకుండా పురుషులు పితృత్వాన్ని పొందేందుకు మైక్రోఫ్లూయిడిక్స్, మైక్రోటెస (మైక్రోసర్జికల్ టెస్టిక్యులర్ స్పెర్మ్ ఎక్స్‌ట్రాక్షన్) అత్యాధునికమైన సంతానోత్పత్తి ప్రక్రియలు ఉన్నాయని తెలిపారు. క్రమం తప్పకుండా వ్యాయామం, ఆరోగ్యకరమైన ఆహారం, సరైన నిద్రతోపాటు ఆరోగ్యకరమైన జీవనశైలి సంతానోత్పత్తిని పెంచుతాయని చెప్పారు. ఒయాసిస్ ఫెర్టిలిటీ కోఫౌండర్, మెడికల్ డైరెక్టర్ డాక్టర్ దుర్గాజీరావు మాట్లాడుతూ తమ లక్ష్యం టైర్ 2, టైర్ 3, గ్రామీణ ప్రాంతాల్లోని జంటలకు సంతానోత్పత్తి చికిత్సలను అందుబాటులోకి తేవడమేనని చెప్పారు. పదేపదే గర్భస్రావాలతో బాధపడుతున్న మహిళలకు సాయం చేయడానికి అధునాతన సాంకేతికత అందుబాటులో ఉందన్నారు. ఒయాసిస్ ఫెర్టిలిటీ, వరంగల్, హనమకొండ క్లినికల్ హెడ్, ఫెర్టిలిటీ స్పెషలిస్ట్ డాక్టర్ జలగం కావ్యారావు మాట్లాడుతూ తమ రెండో సెంటర్ హనుమకొండలో ఉన్నందున చాలా ఆనందంగా ఉందన్నారు. ఈ సెంటర్ ద్వారా ఎన్నో కుటుంబాలకు ఆనందాన్ని అందించాలని కోరుకుంటున్నామని తెలిపారు. తమ విస్తృత శ్రేణి చికిత్సల్లో ఓఐటీఐ, ఐయూఐ, ఐవీఎఫ్, సీఏపీపీఐవీఎం సంతానోత్పత్తి సంరక్షణ, దాతల చికిత్సలు తదితర ఉన్నాయని అన్నారు. ఒయాసిస్ ఫెర్టిలిటీకి సైంటిఫిక్ హెడ్, క్లినికల్ ఎంబ్రియాలజిస్ట్ డాక్టర్ కృష్ణచైతన్య, డాక్టర్ పీ అంజనీదేవి, డాక్టర్ బీ సంధ్యా రాణి, సుధాకర్, జాదవ్ పాల్గొన్నారు.


సరస్వతీ మాతా అలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్న భద్రకాళీ అమ్మవారు

## సరస్వతీ మాత అలంకరణలో భద్రకాళి

వరంగల్, అక్టోబర్ 19 : నగరంలోని ప్రసిద్ధ భద్రకాళీ ఆలయంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు కనులపండువగా కొనసాగుతున్నాయి. ఆరో రోజు శుక్రవారం భద్రకాళీ అమ్మవారు సరస్వతీ మాతా అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. తెల్లవారుజామున అర్చకులు నిత్యాహ్నికం తర్వాత అమ్మవారిని సరస్వతీ మాతాగా అలంకరించారు. ఉదయం గంధోత్సవం నిర్వహించారు. సాయంత్రం సాలభంజిక వాహనసేవ చేశారు. సరస్వతి మాతా అలంకరణలో అమ్మవారిని భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి దర్శించుకున్నారు. సాయంత్రం ఆలయంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. వారికి అర్చకులు మహా ఆశీర్వచనం ఇచ్చారు. అమ్మవారి శేషవస్త్రాలు, ప్రసాదాలను ఈవో శేషుభారతి అందజేశారు.

## పెద్దకొడెపాకలో పూసిన అరుదైన పుష్పం



శాయంపేట, అక్టోబర్ 20 : మండలంలోని పెద్దకొడెపాకకు చెందిన కోమనేని రఘు ఇంటి ఆవరణలో శుక్రవారం అరుదైన పెర్షియన్ కార్పెట్ కాక్టస్ పుష్పం (ఎడిత్ కోలియా గ్రాండిస్ అని దీని శాస్త్రీయ నామం) విరబూసింది. ఎడారిలో అలంకారంగా పెంచే మొక్క పువ్వు సువాసవస్తోంది. 2018 జనవరిలో గుజరాత్ నుంచి మిత్రుడు ఈ మొక్కను అందజేశాడని, మొదటిసారి 2020లో మూడు పూలు, ఈ ఏడాది శుక్రవారం పొద్దున్నే రెండు పూలు పూశాయని రఘు తెలిపాడు.

## కంట్రోల్ రూంను తనిఖీ చేసిన కలెక్టర్


రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

హనుమకొండ, అక్టోబర్ 20: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో హనుమకొండ ఏర్పాటు చేసిన కంట్రోల్ రూంను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సిక్తా పట్నాయక్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. టోల్‌ఫ్రీ నంబర్, సీ విజిల్ పనితీరు, రికార్డులను పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల సంబంధిత ఫిర్యాదుల కోసం కంట్రోల్ రూంతోపాటు టోల్ ఫ్రీ నంబర్ 18004251816ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇది 24గంటలు అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. సీ విజిల్ యాప్ ద్వారా ఇప్పటివరకు 39 ఫిర్యాదులు అందినట్లు కలెక్టర్ తెలిపారు.

## ఎలక్షన్ టూరిస్టుల మాటలను నమ్మొద్దు


కన్నారంలో ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే సతీశ్‌కుమార్‌కు స్వాగతం పలుకుతున్న సర్పంచ్ మార్క మల్లిక

వేలేరు, అక్టోబర్ 20: అసెంబ్లీ ఎలక్షన్లప్పుడు వచ్చే టూరిస్టుల మాటలను నమొద్దని, రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పార్టీకి తిరుగులేదని హుస్నాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వొడితెల సతీశ్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని కన్నారంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయనకు గ్రామస్తులు కోలాటం, డప్పుచప్పుళ్లతో ఘనంగా స్వాగతం పలికారు. ఆనంతరం ఆయన మాట్లాడుతూ హుస్నాబాద్ నియోజకవర్గంలో రూ.వేల కోట్లతో అభివృద్ధి పనులు చేశానని తెలిపారు. ఎల్లప్పుడూ మీ వెంటనే ఉంటానని మరోసారి ఎమ్మెల్యేగా అవకాశం కల్పించి, నియోజకవర్గ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.